# విశ్వాసి జీవితం

**- ఇబ్నె అలీ**

**దైవ ప్రసాదిత ఈ జీవితం ఆయన ఆదేశించిన మార్గంలో పయనించడంలోనే జీవిత సాఫల్యం ఉంది. ఈ ప్రాపంచిక జీవితం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. ఎందుకంటే, పరలోకంలో విజయం సాధించేందుకు మన ప్రాపంచిక జీవిత విధానమే అతి కీలకం. అందుకని ఇస్లాం ధర్మం మనకు జీవన విధానాన్ని కూలంకషంగా చెబుతోంది.**

అల్లాహ్‌ను, దైవప్రవక్తలను, దైవ గ్రంథాలను, దైవదూతలను, పరలోకాన్ని, మంచిచెడులు అల్లాహ్ తరఫునుండే సంభవిస్తాయని, మరణించిన తరువాత మళ్ళీ లేపబడతారని విశ్వసించిన వారిని విశ్వాసులు అంటారు. విశ్వాసి జీవితంలోని ప్రతిరంగంలోనూ అల్లాహ్ ఆదేశానుసారం నడుచుకుంటాడు. తన వ్యక్తిగత జీవితం, సామూహిక జీవితమే కాకుండా జీవితంలోని సామాజిక రంగం, ఆర్థిక రంగం, రాజకీయ రంగం ప్రతీ రంగం అన్నీ అల్లాహ్ నియమ నిబంధనల కనుగుణంగా ఉంటాయి.

దైవ ప్రసాదిత ఈ జీవితం ఆయన ఆదేశించిన మార్గంలో పయనించడంలోనే జీవిత సాఫల్యం ఉంది. ఈ ప్రాపంచిక జీవితం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. ఎందుకంటే, పరలోకంలో విజయం సాధించేందుకు మన ప్రాపంచిక జీవిత విధానమే అతి కీలకం. అందుకని ఇస్లాం ధర్మం మనకు జీవన విధానాన్ని కూలంకషంగా చెబుతోంది. జీవన నియమ నిబంధనలను విడమరిచి వివరిస్తోంది. ప్రపంచంలో ఎలా జీవితం గడపాలి? ఏ విషయాలను అవలంభించాలి? ఏ విషయాలను విడనాడాలి? అనేవాటి గురించి తెలుపుతుంది.

అల్లాహ్ మానవుడిని ఈ ప్రపంచానికి నాయకుడిగా చేసి పంపాడు. సృష్టితాలలో మానవుడు అత్యుత్తముడు. మానవుడికి ఆలోచించే, అర్థం చేసుకునే సామర్థ్యాలున్నాయి. మంచి చెడులను గ్రహించే బుద్ధీ వివేకాలున్నాయి. అందుకనే మానవుడు తాను చేస్తున్న ప్రతి పనికి జవాబుదారీ కావలసి ఉంటుంది. దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయడం జరిగింది.

'ఆయన (అల్లాహ్) తన ఇష్టప్రకారం కొందరిని అపమార్గానికి గురిచేస్తాడు. తన ఇష్ట ప్రకారం కొందరికి సన్మార్గం చూపుతాడు. తప్పకుండా మీ పనులను గురించి మిమ్మల్ని సంజాయిషీ అడగటం జరిగి తీరుతుంది : (అన్‌నహ్ల్ : 93)

వ్యక్తిగత జీవితానికి సంబంధించి ప్రతి వ్యక్తి తనకుతాను పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. తాను చేసిన ప్రతి కార్యానికి జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. మరోచోట ఇలా సెలవీయడం జరిగింది :

'ఆ రోజున మానవుడికి అతడు ముందూ వెనుకా చేసిందీ, చేయించిందీ అంతా తెలుపబడుతుంది. అదీగాక, మానవుడు ఎన్ని సాకులు చెప్పినా స్వయంగా అతనికే తనను గురించి బాగా తెలుసు.'

(అల్ ఖియామ్ : 14-15)

మనిషి తాను ప్రపంచంలో చేసే ప్రతి పనికీ తానే బాధ్యుడని, తాను చేసే చెడు పనులకు పరలోకంలో శిక్ష అనుభవించాల్సి ఉందని పై ఖుర్‌ఆన్ సూక్తుల ద్వారా తెలుస్తుంది.

**(మిగతా వచ్చేవారం)** ✪

**తుదిగేటు**

